31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

మంగళవారం 09 జూన్ 2026 పేజీలు : 8

## గ్రామసభలో పాల్గొన్న ఎస్పీ అశోక్‌కుమార్



**చురకలు ప్రతినిధి, కోరుట్ల, జూన్ 08 :-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మోహన్‌రావుపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చేపడుతున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా ప్రచారంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం సమాజం మొత్తం బాధ్యత 2లో

# నూరు అబద్దాల కేసీఆర్ కుటుంబం

**-అబద్ధాల మాటల్లో వాళ్లే దిట్టా..**

**-నూటికి నూరు శాతం మళ్ళీ కాంగ్రెస్‌దే గెలుపు**

**-రేవంత్ రెడ్డి పక్కా రెండో సారి ముఖ్యమంత్రి..**

**-హరీశ్ రావు పై విప్ విజయ్ ఫైర్**



**కట్టా నరేందర్/పెద్దపల్లి :** -సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న హరీష్ రావు సహా కేసీఆర్ కుటుంబం నూరు అబద్ధాలు మాట్లాడే కుటుంబం. హరీశ్ రావు మాటలన్నీ అబద్ధాలే అని ప్రభుత్వ విప్ విజయరమణ రావు తీవ్రంగా ఖండించారు. అబద్ధాలను పదే పదే చెప్పి నిజం చేసే విధంగా హరీష్ రావు వ్యవహరిస్తున్నారని, వారి కల్లబొల్లి మాటలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సోమవారం పెద్దపల్లి లో విప్ విజయరమణ రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అం దిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు ఫ్రెస్టేషన్ ఫీల్ అవుతున్నారని మండిపడ్డారు. గతం లో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయకుండా రైతన్నలను బ్యాంకులో డిఫాల్టర్లుగా మిగిల్చారని ఆరోపించారు. కానీ ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతన్నలకు వరంగల్ డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి రైతన్నలకు అండగా నిలబడ్డామని గుర్తు చేశారు. గతంలో రైతులకు వరి వేస్తే ఉరే అన్న బిఆర్ఎస్ పార్టీ వారు రైతు సంక్షేమం గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ యాసంగి సీజన్లో కేంద్ర ప్రభుత్వం 51 లక్షల టన్నుల కొనుగోలుకు అనుమతులు ఇస్తే మా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 70 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యాన్ని కొనుగోలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ సీజన్లో రాష్ట్రంలో మొక్కజొన్న పంట అధికంగా పండినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వకపోయినా తమ ప్రభుత్వం సుమారు 3500 కోట్ల బడ్జెట్ కేటాయించి మక్కలను కొనుగోలు చేశామని ఆ డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో జమ చేశామని ఇవన్నీ హరీష్ రావు కు కనబడటం లేదా అని ప్రశ్నించారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఇక నైనా అబద్దాల మాటలు మానుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తు చేశారు. కేసీఆర్ తానే ఇంజనీర్ గా, హరీష్ రావు అసిస్టెంట్ ఇంజనీర్ గా వ్యవహరించి లక్ష కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తే అది చివరికి కూలేశ్వరం అయిందని విమర్శించారు .కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టు గానీ జూరాల ప్రాజెక్టు గానీ కడెం ప్రాజెక్టు గానీ మరియు ఇతర ప్రాజెక్టులు ఇప్పటి 2లో

### ఆక్రమణలు గుర్తించి

# చర్యలు తీసుకోండి



**-మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

**జగిత్యాల ప్రతినిధి, జూన్ 08:** జగిత్యాల జిల్లా జగిత్యాల అర్బన్, రూరల్ మండల పరిధిలో చెరువులు కుంటలు హద్దులు నిర్ణయించడంతో పాటు ఆక్రమణలు తొలగించు నిమిత్తం చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, బి, ఆర్,ఎస్, పార్టీ జనరల్ సెక్రటరీ జీవన్ రెడ్డి జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సోమ వారం ఆర్డీఓ మధు సుధన్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ...చెరువులు కుంటలు ప్రధానమైన అంశం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువులు కుంటలు ఎక్కడ ఆక్రమణకు గురైన కానీ ఆక్రమణలను తొలగింప చేసి చెరువులను పునరుద్ధింపజేయడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారని జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లాలో వచ్చేస రికి మోతే చెరువు కానీ ముప్పారపు చెరు వు గాని జగిత్యాల పట్టణ సరిహద్దులో ఉన్నాయని,సరిహద్దుల్లో ఉండడంతోని పూర్తిగా ఆక్రమణకు గురవుతున్నాయని అన్నారు. చెరువులను మట్టితో నింపేయ డంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది 2లో

### ఇందిరమ్మ ఇళ్లకు

# ఇసుక కొరత రాకుండా చూడండి

**-మైనింగ్ శాఖ ప్రొఫైల్ సిద్ధం చేయాలి..**

**-కలెక్టర్ చిత్రా మిశ్రా**





**చురకలు ప్రతినిధి :** కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఎలాంటి ఆటంకాలు లేకుండా అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డిస్ట్రిక్ట్ లెవల్ సాండ్ కమిటీ) సమావే శంలో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ గృహాల నిర్మాణంతో పాటు జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు కూడా ఇసుక కొరత తలెత్తకుం డా సంబంధిత శాఖలు చర్యలు తీసుకో వాలని సూచించారు. ఇసుక సరఫరా ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మైనింగ్ శాఖ సమగ్ర ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపొందించి సమర్పించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులు, కాలువల్లో పూడిక తొలగింపు (డీసిల్టేషన్) పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వ యంతో పనిచేస్తూ అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాల ని ఆదేశించారు. సమావేశంలో ఇసుక నిర్వహణ, సరఫరా, పూడిక తొలగింపు తదితర ఐదు కీలక అంశాలపై అధికా రుల నుంచి వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు.

### బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

# గ్రీవెన్స్ డే కార్యక్రమం

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 26 ఫిర్యాదులు స్వీకరణ: ఎస్పీ మహేష్ బిగితే**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూన్ 08 :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడ మే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్క రించే విధంగా కృషి చేయడం జరుగు తుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదు దారు లతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి 2లో

## డాగ్ స్క్వాడ్‌తో కోరుట్లలో పోలీసుల ప్రత్యేక తనిఖీలు







**చురకలు ప్రతినిధి,కోరుట్ల,జూన్,08 :** జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణంలోని బస్టాండ్, మార్కెట్ ప్రాంతాలు ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా జగిత్యాల పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన డాగ్ స్క్వాడ్ సహాయంతో అనుమానాస్పద వ్యక్తులు, గంజాయి ఇతర మత్తు పదార్థాల నిల్వ, రవాణాపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా లేదా మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.ఈ తనిఖీలు ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా నిర్వహించినట్లు కోరుట్ల ఎస్ఐ తెలిపారు.

## నూరు అబద్ధాల కేసీఆర్ కుటుంబం

**మొదటి పేజీ తరువాయి....** వరకు చెక్కు చెదరకుండా ఉన్నాయని అన్నారు.ఇవి చాలావ కాంగ్రెస్ పార్టీ నిబద్ధత గురించి తెలుసుకోవాలని సూచించారు.ఇకనైనా కేసీఆర్ మరియు వారి కుటుంబ సభ్యులు అబద్ధాల మాటలు మానుకొని అవసరమైతే హుందాగా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు కూర గోపాల్ రెడ్డి,మినుపాల ప్రకాష్ రావు,పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగులా మల్లయ్య,మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

## గ్రీవెన్స్ డే కార్యక్రమం

**మొదటి పేజీ తరుఆయి....**పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ఆక్రమణాలు గుర్తించి చర్యలు తీసుకోండి

**మొదటి పేజీ తరువాయి...**

భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని, దీనితో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని,చేపల వృత్తిలో ఉన్న మత్స్య కార్మికులు వారి వృత్తి ఆటంకం ఏర్పడుతుందన్నారు. మోతే ముప్పారపు చెరువు సంబంధించి పలు పర్యాయాలు జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు.ఎఫ్ టి ఎల్ నిర్ధారణ చేయాలి ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ నిర్ధారణ చేయడంతో పాటుగా ఎఫ్ టి ఎల్ పరిధి లోపల మట్టితో నింపిన ఆక్రమణలు తొలగింపు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈరోజు కూడా గౌరవ ఆర్డిఓ కు జగిత్యాల సరిహద్దుల్లో ఉన్నటువంటి ఈ ముప్పారపు చెరువు తిమ్మాపూర్ రఘురాములకోట తిప్పన్నపేట చెరువుల ఆక్రమణ గురైన ఆక్రమణలను తొలగించి ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ నిర్ధారించాలని కోరారు.అలాగే సారంగాపూర్ మండలానికి సంబంధించి నాగులకుంటా మత్స్య సహకార సంఘ సభ్యులు వీరు సమాజంలో అధిక జనాభా కలిగినటువంటి వర్గం ముదిరాజులని,ముదిరాజులకు ఉన్నటువంటి ఏకైక కులవృత్తి కాయగూరలు పండ్లు పలాలు అమ్ముకోవడం గంగపుత్రులు గాని ముదిరాజులు కానీ కులవృత్తి చేపల వృత్తి చెరువుల కుంటలు ఏ గ్రామ పరిధిలో ఉన్నప్పటికీ ఆ గ్రామ పరిధిలోని మత్స్య సహకార సంఘాలకు హక్కులు కలిగి ఉంటాయని,నగునూరుకు సంబంధించిన మత్స్య కార్మిక సహకార సంఘం నాకు తెలిసి సంవత్సర కాలం గడుస్తుందని,భూస్వాములు మేము భూమిని కలిగి ఉన్నామని చెప్పి షెటర్ తొలగింప చేశారని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.ఫిర్యాదులు చేయడంతోని రీస్టోర్ చేశారని,వర్షాకాలంలో నీరు వచ్చే అవకాశం ఉందని,ఈ నిరుపేద వర్గాలకు ఉన్నటువంటి ఏకైక ఆధారం నగునూరు కుంటలో షెటర్స్ ఎవరు తొలగించకుండా పరిరక్షింప చేయబడే విధంగా ఎఫ్ టి ఎల్ నిర్ధారణ చేసి అందులో ఏ విధమైన ఆక్రమణలు గురి కాకుండా రాష్ట్ర ప్రభుత్వంపై రెవెన్యూ అధికారులపై ఉందని ఆర్డీవో కు విజ్ఞప్తి చేయడం జరిగిందని,ఆర్డీవో సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని జీవన్ రెడ్డి అన్నారు.

# గ్రామసభలో పాల్గొన్న ఎస్పీ అశోక్‌కుమార్

**మొదటి పేజీ తరువాయి...**అని పేర్కొంటూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, ఏటీఎం పిన్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఫేక్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు.అదేవిధంగా మహిళలు, చిన్నారుల భద్రత, బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై వేధింపుల నివారణ, ప్రజా ఆస్తుల పరిరక్షణ, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల పాత్రపై కూడా అవగాహన కల్పించారు.ఈ గ్రామసభలో గ్రామస్థులు తమ గ్రామంలో వరి కొయ్యలు కాల్చకూడదని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ రెడ్డి, కోరుట్ల ఇన్‌చార్జ్ సీఐ బి. సురేష్ బాబు, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీఆర్ఓ రాజశేఖర్, ఎస్ఐ లు చిరంజీవి, రామచంద్రం, శ్రీధర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగమణి, గ్రామ సర్పంచ్ సరికెళ్ల లతిక, ఉపసర్పంచ్ వెంకటేష్, గ్రామ పెద్దలు గ్రామస్థులు పాల్గొన్నారు.

# హిమగిరి శిఖరాలపై మానవసేవకు నిలువెత్తు నిదర్శనం

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతిలో హిమాలయ పర్వత శ్రేణులకు అత్యున్నతమైన, పవిత్రమైన స్థానముంది. మంచు దుప్పట్లు కప్పుకున్న ఆ నింగిని తాకే శిఖరాలు కేవలం భౌగోళిక అద్భుతాలు మాత్రమే కావు; అవి తరతరాల శ్రద్ధకు, తపస్సుకు, ముక్తి మార్గానికి సజీవ సాక్ష్యాలు. ఈ హిమగిరి ఒడిలో కొలువైన యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ అనే పుణ్యక్షేత్రాల సమాహారమే చార్‌ధామ్ యాత్ర. ప్రతి ఏటా అక్షయ తృతీయ నాడు ప్రారంభమై, శీతాకాలపు చలి తీవ్రతకు ఆలయాల తలుపులు మూసేంతవరకు సాగే ఈ యాత్రను తమ జీవితంలో ఒక్కసారైనా దర్శించి పునీతులు కావాలని కోట్లాది మంది హిందువులు తపిస్తుంటారు. సముద్ర మట్టానికి వేలాది అడుగుల ఎత్తున, ప్రకృతి తన విశ్వరూపాన్ని ప్రదర్శించే ఆ కఠిన భూభాగాలలో సాగే ప్రయాణం కేవలం ఒక భక్తి ప్రయాణమే కాదు; అది శారీరక దారాఢ్యనికి, మానసిక నిబ్బరానికి, ప్రాణశక్తికి ఎదురయ్యే అత్యంత క్లిష్టమైన పరీక్ష.ఊపిరి పీల్చడమే ఒక సాహసంగా మారే ఆ



హిమపాతాల మధ్య, ఆకలితో అలమటించే భక్తుల పాలిట అన్నపూర్ణమ్మ చేతి ప్రసాదంగా మారి, అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్నారు తెలంగాణ గడ్డపై ఆధ్యాత్మిక చైతన్యానికి మారుపేరైన సిద్ధిపేట ప్రాంత వాసులు. సిద్ధిపేటకు చెందిన 'కేదార్ నాథ్ అన్నదాన సేవా సమితి', 'అమర్ నాథ్ అన్నదాన సేవా సమితి'ల సంయుక్త ఆధ్వర్యంలో, చైర్మన్ చీకోటి మధుసూదన్, కార్యదర్శి నందిని శ్రీనివాస్ నేతృత్వంలో తరతరాలుగా వస్తున్న "అన్నదానం మహాదానం" అనే ఆర్ష వాక్యాన్ని అక్షరాలా పాటిస్తూ, వేల కిలోమీటర్ల దూరంలోని ఉత్తరాఖండ్ పర్వతాగ్రాలపై వారు సాగిస్తున్న నిత్య అన్నదాన మహాయజ్ఞం మానవతా సేవకు ఒక సరికొత్త, అద్భుతమైన నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.సనాతన ధర్మంలో ఆకలితో ఉన్న ప్రాణికి పెట్టే అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావించబడుతుంది. భూదానం, గోదానం, సువర్ణదానం వంటి ఎన్నో దానాలు ఉన్నప్పటికీ, అవన్నీ పొందిన వానికి ఇంకా కావాలనే కోరిక మిగిలే ఉంటుంది; కానీ కేవలం అన్నదానం మాత్రమే లబ్ధిదారుని నోట 'తృప్తి' అనే మాటను తెప్పించగల ఏకైక విశిష్ట సేవ. ఇటువంటి పవిత్రమైన భావనను గుండెల్లో నింపుకున్న సిద్ధిపేట కేదార్ నాథ్ అన్నదాన సేవా సమితి, అమర్ నాథ్ అన్నదాన సేవా సమితి దాతలు, స్వచ్ఛంద సేవకులు చార్‌ధామ్ యాత్రలో ఎదురయ్యే అతి పెద్ద సమస్యను గుర్తించారు. చీకోటి మధుసూదన్ చైర్మన్‌గా, నందిని శ్రీనివాస్ కార్యదర్శిగా ఈ సంస్థలను ముందుండి నడిపిస్తూ, క్షేత్రస్థాయిలో అంకితభావంతో ప్రణాళికలు రచిస్తున్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చే యాత్రికులలో అత్యధికులు వృద్ధులు, మహిళలు, ఆర్థికంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతికి చెందినవారే ఉంటారు. తీవ్రమైన చలి, ఆక్సిజన్ కొరతతో కూడిన వాతావరణం, ఎడతెరిపి లేకుండా కురిసే హిమవర్షం, హఠాత్తుగా విరిగిపడే కొండచరియల మధ్య గంటల తరబడి, కొన్నిసార్లు రోజుల తరబడి నడక మార్గంలో ప్రయాణించే భక్తులకు కడుపునిండా వేడివేడి పోషకాహారం లభించడం అనేది ఊహకందని వరం. ఆ శూన్యంలో, ఆ గడ్డకట్టే చలిలో సిద్ధిపేట కేదార్ నాథ్ అన్నదాన సేవా సమితి, అమర్ నాథ్ అన్నదాన సేవా సమితి బృందాలు ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రాలు భక్తులకు శారీరక బలాన్ని మాత్రమే కాదు, వారి యాత్రను విజయవంతంగా పూర్తి చేయడానికి అవసరమైన మానసిక ధైర్యాన్ని కూడా నూరిపోస్తున్నాయి.ఈ మహత్కార్యం వెనుక దాగి ఉన్న ప్రణాళికను, శ్రమను లోతుగా పరిశీలిస్తే సిద్ధిపేట కేదార్ నాథ్ అన్నదాన సేవా సమితి, అమర్ నాథ్ అన్నదాన సేవా సమితి నిర్వాహకుల అచంచలమైన దీక్ష, సేవానిరతి ఎంతటిదో స్పష్టమవుతుంది. చైర్మన్ చీకోటి మధుసూదన్, కార్యదర్శి నందిని శ్రీనివాస్ వ్యవహారదక్షతతో దక్షిణాదిలోని తెలంగాణ నుండి ఉత్తరాదిన చైనా సరిహద్దులకు సమీపంలో ఉండే హిమాలయ ప్రాంతాలకు అన్నదాన సామగ్రిని రవాణా చేయడం ఒక అసాధారణమైన వ్యూహాత్మక ప్రక్రియగా మార్చారు.

# 14వ వార్డులో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక నిర్వహణ

**-ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం : కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి**




**చురకలు ప్రతినిధి,కోరుట్ల, జూన్,08 :** కోరుట్ల పట్టణంలోని 14వ వార్డులో సోమవారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి హాజరై వార్డు ప్రజల సమస్యలను తెలుసుకుని వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో మంచినీటి సరఫరా, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, దోమల నివారణ తదితర సమస్యలపై ప్రజలు తమ సమస్యలను వివరించారని తెలిపారు.ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందని ఆమె పేర్కొన్నారు. అలాగే కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు సహకారంతో వార్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు.మహిళలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతానని చెప్పారు.జువ్వాడి నర్సింగరావు సహకారంతో 14వ వార్డును కోరుట్లలో ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు దండవేని వెంకటేష్, ఆర్ పి లక్ష్మి, వార్డ్ ఆఫీసర్ లావణ్య, కరెంట్ సూపర్వైజర్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలివేరి విజయ్, దివాకర్, గంగాధర్ శేఖర్, మెరమ్ నరేష్,మహిళా సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# బీటెక్ విద్యార్థి రాహుల్ మృతి..

**-ఐలాపూర్ గ్రామంలో విషాదఛాయలు**





**చురకలు ప్రతినిధి,కోరుట్ల, జూన్, 08 :** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి అంకం రాహుల్ మృతి చెందిన వార్త గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న రాహుల్ గత నెల 27వ తేదీన అదృశ్యమైన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.రాహుల్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్థులు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అతడు క్షేమంగా తిరిగి వస్తాడని ఆశగా ఎదురుచూస్తున్న కుటుంబానికి గుండెలు పగిలే వార్త అందింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా సింగరాయకొండ సమీపంలోని ఓ బావిలో రాహుల్ మృతదేహం లభించినట్లు అధికారుల ద్వారా సమాచారం అందింది.ఈ సమాచారం తెలియగానే ఐలాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామ ప్రజలు బంధువులు స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రాహుల్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఇది ఆత్మహత్య కాదని పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు.గ్రామ సర్పంచ్ ధ్యావనపల్లి రామకృష్ణ మాట్లాడుతూ రాహుల్ మృతి గ్రామానికి తీరని లోటని కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని అన్నారు. ప్రస్తుతం రాహుల్ కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి బయలుదేరగా గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. రాహుల్ కుటుంబం ఆర్థికంగా వెనుకబడినప్పటికీ తమ పిల్లలకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ఎంతో కష్టపడి జీవనం సాగిస్తోంది. తండ్రి అంకం రాజేష్ గల్ఫ్ దేశంలో పనిచేసి అనారోగ్య కారణాలతో స్వదేశానికి తిరిగి వచ్చి కుట్టు మిషన్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి అంకం మమత బీడీలు చేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. రాహుల్ సోదరి అంకం హారిక ఈ ఏడాది పదో తరగతిలో 556 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. అలాంటి కుటుంబానికి ఇంత పెద్ద విషాదం చోటుచేసుకోవడం గ్రామ ప్రజలను కలచివేసింది. ఈ ఘటన వెనుక ఉన్న పూర్తి నిజాలను వెలికితీసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధ్యావనపల్లి రామకృష్ణ మాట్లాడుతూ రాహుల్ మృతి వెనుక ఉన్న అన్ని కోణాల్లో అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి వాస్తవాలను బయటపెట్టి కుటుంబానికి న్యాయం చేయాలి అని కోరారు. ప్రస్తుతం రాహుల్ మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పైడిపల్లిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 25 లక్షల నిధులు

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూన్ 08 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పైడిపల్లి గ్రామంలో ఒకటవ వార్డు కాపువాడలో కమ్యూనిటీ హాల్ అదనపు పనుల నిర్మాణానికి ఖమ్మం రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ లాడ్స్ నుండి జూన్ 6 న,రూ.25 లక్షల నిధులు విడుదల చేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టర్ కు మంజూరి లెటర్ పంపినట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు.తన ఎంపీ ల్యాడ్ నుండి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు నిధులు మంజూరిచేసిన ఎంపీవద్దిరాజు రవిచంద్రకు గ్రామ సర్పంచ్, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# కోరుట్ల మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వి.రాఘవేంద్ర



**చురకలు ప్రతినిధి,కోరుట్ల, జూన్, 08 :** కోరుట్ల మున్సిపాలిటీ కమిషనర్‌గా వి.రాఘవేంద్ర పూర్తి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ అధికారులు,సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.పట్టణ అభివృద్ధి,పారిశుద్ధ్యం,మౌలిక వసతుల మెరుగుదల, ప్రజలకు మెరుగైన సేవల అందజేతకు ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తానని కమిషనర్ రాఘవేంద్ర పేర్కొన్నారు.ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు సిబ్బందితో సమన్వయంతో ముందుకు సాగుతానని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు,అధికారులు స్థానిక నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.కోరుట్ల పట్టణ అభివృద్ధికి ఆయన నాయకత్వంలో మరింత వేగం చేకూరాలని ఆకాంక్షించారు.

# కోరుట్లలో ఇందిరమ్మ చీరల పంపిణీ

**-మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల,జూన్ 08 :** కోరుట్ల పట్టణంలోని 16వ వార్డులో సోమవారం వార్డు సభను కౌన్సిలర్ పొట్ట సురేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్ ప్రారంభించారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి జగదీష్, లైన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రావు, అంగన్‌వాడీ టీచర్ లత,ఆర్‌పీ పావని, మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్,వైస్ చైర్మన్ షాహిద్‌లను స్థానికులు శాలువాతో సన్మానించి అభినందించారు.

# మృతురాలు కుటుంబానికి అండగా మంత్రి అడ్లూరి

**-ఒకరికి ఉద్యోగం ఇస్తానని హామీ**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూన్ 08 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజారాంపల్లెలో రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన చర్లపల్లె కు చెందిన పత్తిపాక మునిలత కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు.ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూమృతు రాలు కుటుంబానికి అండగా ఉంటామని రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతు రాలు మునిలత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళను మోసం చేసి బంగారం కాజేసిన లేడీ కిలాడీ అరెస్ట్

### -24 గంటల్లోనే నిందితురాలిని పట్టుకున్న కోరుట్ల పోలీసులు



**చురకలు ప్రతినిధి,కోరుట్ల, జూన్ 08 :** వృద్ధ మహిళకు మాయమాటలు చెప్పి ఆమె మెడలో ఉన్న 25 గ్రాముల బంగారు గొలుసును కాజేసిన లేడీ కిలాడీని కోరుట్ల పోలీసులు కేవలం 24 గంటల్లోనే పట్టుకొని నగదు, బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.ఈ విషయాన్ని కోరుట్ల సీఐ కె.లక్ష్మీ నారాయణ వెల్లడించారు.జూన్ 6న వల్లంపల్లి గ్రామానికి చెందిన కోటే గంగు (70) అనే వృద్ధురాలు కోరుట్ల బస్టాండ్‌లో రాయికల్ వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా లావణ్య అనే మహిళ ఆమెతో పరిచయం పెంచుకుంది.మోకాళ్ల నొప్పులకు తనకు తెలిసిన డాక్టర్ ఉన్నాడని నమ్మించి ఆటోలో నంది కమాన్ ప్రాంతానికి తీసుకెళ్లింది.అక్కడ ఒక భవనాన్ని చూపించి ఎక్స్‌రే తీయాల్సి ఉంటుందని, మెడలో బంగారం ఉండకూడదని చెప్పి వృద్ధురాలి మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసును తీసుకుంది. అనంతరం కూరగాయలు కొనుగోలు చేసి వస్తానని చెప్పి అక్కడి నుంచి పరారైంది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు అదే రోజు కోరుట్ల పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే ఎస్సై ఎం. చిరంజీవి కేసు నమోదు చేసి బస్టాండ్ నంది కమాన్ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు.బాధితురాలి నుంచి సేకరించిన వివరాల ఆధారంగా నిందితురాలిని గుర్తించి సోమవారం ఉదయం కోరుట్ల బస్టాండ్‌లో అదుపు లోకి తీసుకున్నారు.విచారణలో నింది తురాలు నవీపేట మండలం మోకాని పల్లెకు చెందిన లావణ్యగా తేలింది. గతంలో కూడా ఇదే తరహా మోసాలకు పాల్పడి వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. దొంగిలించిన బంగారు గొలుసును నిజామాబాద్‌కు చెందిన స్వర్ణకారుడు ఆకుల ప్రసాద్‌కు విక్రయించి రూ.2.50 లక్షలు పొందినట్లు విచారణలో వెల్లడైంది. నిందితురాలి వద్ద నుంచి రూ.2.03 లక్షల నగదు స్వాధీనం చేసుకోగా ఆకుల ప్రసాద్ వద్ద నుంచి బంగారు గొలుసును రికవరీ చేశారు. దొంగ సొత్తు కొనుగోలు చేసినందుకు ఆకుల ప్రసాద్‌ను కూడా కేసులో చేర్చి రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ అపరిచిత వ్యక్తుల మాటలను నమ్మవద్దని అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అలాగే స్వర్ణకారులు దొంగ సొత్తు కొనుగోలు చేసి నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, మెట్ పల్లి డీఎస్పీ ఏ. రాములు పర్యవేక్షణలో సీఐ కె. లక్ష్మీనారాయణ సూచనలతో ఎస్సై ఎం. చిరంజీవి,ఏఎస్సై రాజశ్రీ,హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి,కానిస్టేబుళ్ల కిరణ్,రాజ్ కిరణ్‌లు నిందితురాలిని పట్టుకోవడంలో విశేష కృషి చేశారు. వారి సేవలను జిల్లా ఎస్పీ అభినందించారు.

# సుందిల్లలో మూడేళ్ల నీటి కష్టాలకు చెక్

### -ఒకటి,రెండు,మూడు వార్డుల్లో పైప్‌లైన్ మరమ్మతులు షురూ
### -పది రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన గర్రెపల్లి చంద్రకళ నరేష్ గౌడ్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 08 :** రామగిరి మండలం సుందిల్ల గ్రామంలోని ఒకటి,రెండు, మూడు వార్డుల ప్రజలకు మూడేళ్లుగా వెంటాడుతున్న తాగునీటి సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. వాటర్ పైప్‌లైన్ లీకేజీ కారణంగా గుడివాడ ప్రాంతం,బాలసాని రవి ఇంటి పరిసర పైభాగంలో ఉన్న ఇళ్లకు సరైన నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,గ్రామస్థులు సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి,ఐదవ వార్డు సభ్యురాలు గర్రెపల్లి చంద్రకళ నరేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించిన సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి ఆదేశాల మేరకు పది రోజులలోపు పైప్‌లైన్ మరమ్మతుల పనులను పూర్తి చేస్తానని బాధ్యత తీసుకుని పనులు ప్రారంభింపజేశారు.ఐదవ వార్డుకు సంబంధించిన పనుల విషయంలో ఐదవ వార్డు సభ్యురాలు త్వరితగతిన చర్యలు తీసుకుని మరమ్మతులు చేపట్టారు.ప్రస్తుతం పైప్‌లైన్ మరమ్మతుల పనులు జరుగుతున్నందున నీటి సరఫరా సుమారు ఒక గంట ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని,ప్రజలు సహకరిం చాలని నాయకులు కోరారు.మూడేళ్ల సమస్యకు పరిష్కారం లభిస్తుండడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సకాలం లో స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి,ఐదవ వార్డు సభ్యురాలు గర్రేపల్లి చంద్రకళ నరేష్ గౌడ్ దంపతులకు, గ్రామ కార్యదర్శి రమేష్,గ్రామ పంచాయతీ సిబ్బందికి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

### -అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
### -మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్



**చురకలు ప్రతినిధి,కోరుట్ల, జూన్, 08 :** కోరుట్ల పట్టణంలోని 31వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ స్థానిక వార్డు కౌన్సిలర్ ఏలుగూరి శ్వేత కిరణ్‌తో కలిసి సోమ వారం భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచు కొని దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.31వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు.అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు సహకారంతో కోరుట్ల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారు లు, వార్డు ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ వల్లభ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపమందు వైద్య శిబిరం

### -డాక్టర్ బాదాం మోహన్ ఆధ్వర్యంలో రోగులకు చికిత్స





**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూన్ 08 :** శ్రీవల్లభ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధనుష్ ఆరోగ్య కేంద్రంలో సోమవారం చేప మందు వైద్య శిబిరం ప్రారంభమైంది.వయోవృద్ధుల సంక్షేమ సంఘం,కోరుట్ల సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో డాక్టర్ బాదాం మోహన్ చేపమందు ద్వారా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ వల్లభ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకుపల్లి రాజేష్ బాబు,రాష్ట్ర అధ్యక్షుడు భోగ రవికుమార్, జిల్లా అధ్యక్షుడు ముక్క దాము, డాక్టర్ సాంబార్ అశోక్, అడువాల ప్రభాకర్, చిద్రాల రామన్న, వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాచర్ల శంకర్, ఉపాధ్యక్షుడు ముల్కా రాజేశం, కార్యదర్శి బాలే భూమయ్య, సలహాదారులు గోడెకె కిషన్,భీమనాది ప్రభాకర్,సభ్యులు నడికట్ల నర్సయ్య, అరిసనపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.శ్రీ వల్లభ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించబడుతుండగా,కార్యక్రమానికి వేదికను అందించిన వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాచర్ల శంకర్‌కు ట్రస్ట్ అధ్యక్షుడు చెరుకుపల్లి రాజేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# మజీద్ కమిటీ సభ్యులకు సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (అంతర్గాం) జూన్ 8 :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టిటిఎస్ అంతర్గాం గ్రామ జామా మజీద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ జియో బాయ్ షేక్ అలీ పాషా, మజుద్ ఖాన్ ను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా జామా మజీద్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అల్తాఫ్ మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా జామ మజీద్, పేద మధ్య తరగతి కుటుంబాల కోసం ఆలోచించి ఎండి జాకీర్ హైమద్ బి గ్రూప్ ద్వారా వీరు ఎంతో అభివృద్ధి చేయడం జరుగుతుంది. అనంతరం ఎండి జాకీర్ మాట్లాడుతూ మా అంతర్గాం ముస్లిం మైనార్టీ కుటుంబాలకు కాంట్రాక్టర్ జియో బాయ్, షేక్ ఆలి పాషా, మజుద్ ఖాన్ కుల, మత, పేద మధ్యతరగతి విభేద లేకుండా ఎన్నో కుటుంబాలకు ఆపదలో ముందుంటూ అనేక సహాయ,సహకారాలు అందిస్తూ, ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆపదలో నేనున్నానంటూ ముందుకు వచ్చి ఎంతోమందికి ఆపద బాంధవుడు లాగా వెన్నంటే ఉంటూ మాకు సహాయ సహకారాలు అందిస్తున్నటువంటి జియో బాయ్, షేక్ అలీ పాషా కు ఎప్పుడు రుణపడి ఉంటామని వారి సేవలను ఎప్పుడు గుర్తుపెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన వేదికలే గ్రామసభలు

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**చురకలు ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి, జూన్ 08 :** గ్రామాల్లో ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు గ్రామ సభలు సమర్థవంతమైన వేదికగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4, 6, 8,10 తేదీలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రతి గ్రామ సభలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు .గ్రామ సభల ద్వారా గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతుందని అన్నారు. ఎస్.ఐ.ఆర్ నమోదు ప్రక్రియ, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల సేద్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్యం, కాలుష్య నియంత్రణ, సురక్షిత తాగునీటి నిర్వహణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.రుద్రారం గ్రామ సభలో రైతులు పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించిన సమస్యలు, రహదారులు, డ్రైనేజీ తదితర అంశాలపై వినతిపత్రాలు సమర్పించారని చెప్పారు. అందిన వినతులను సంబంధిత అధికారుల ద్వారా వెంటనే పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ అధికారి బాబూరావు, ఆర్డీఓ రవీందర్, తహసీల్దార్ రవికుమార్, ఎంపిడిఓ, సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో పాత ఓటర్ సెర్చ్ విధానాన్ని పునరుద్ధరించాలి

**- జిల్లా స్థాయి హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేయాలి**

**-ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఎంఐఎం నేతల వినతి**



**చురకలు ప్రతినిధి,కరీంనగర్, జూన్ 8 :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ఓటర్లకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎంఐఎం కరీంనగర్ అధ్యక్షులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆదేశాల మేరకు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్కు ప్రజావాణి లో వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో ఉన్న ఎస్ ఐ ఆర్-2002 ఓటర్ సెర్చ్ పోర్టల్లో పేరు, ఇంటి నంబర్, ఎపిక్ నంబర్, పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ ఆధారంగా ఓటర్ల వివరాలను సులభంగా వెతికే అవకాశం ఉండేదని తెలిపారు. ప్రస్తుతం కొత్త పోర్టల్లో ఈ ప్రాథమిక సెర్చ్ ఆప్షన్లు తొలగించడం తో ఓటర్లు, రాజకీయ పార్టీ ప్రతినిధులు,బూత్ స్థాయి ఏజెంట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించి ప్రజల సందేహాలను నివృత్తి చేయడానికి రాష్ట్ర లేదా జిల్లా స్థాయిలో అందుబాటులో ఉండే ఎస్ఐఆర్ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రతి జిల్లాలో ప్రత్యేక ఎస్ ఐ ఆర్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసి, ఫిర్యాదులు,అభ్యర్థనలు, సాంకేతిక సమస్యలకు వెంటనే పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.పాత ఓటర్ సెర్చ్ విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు జిల్లా స్థాయిలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా ఎన్నికల అధికారులకు సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం జాయింట్ సెక్రెటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, మాజీ కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ మొహియుద్దీన్ బాబు జానీ, కంటెస్టెడ్ కార్పొరేటర్ అన్నెమల్ల సురేష్, ఖదీర్ శాఖాన్, రొండి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# 12న జమ్మికుంటకు మాజీ మంత్రి హరీష్‌రావు రాక

**-ఎం పి ఆర్ గార్డెన్ లో గులాబీ కార్యకర్తల సమావేశం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 8 :**

ఈనెల 12న మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జమ్మికుంటకు రానున్నారు. ఉదయం 10 గంటలకు జమ్మికుంటలోని ఎం పి ఆర్ గార్డెన్ లో జరిగే భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారు. బి ఆర్ ఎస్ పార్టీ సభ్యత్వంతో పాటు ఓటరు నమోదు అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ గురించి కూడా ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. చాలాకాలం తర్వాత హుజురాబాద్ నియోజకవర్గానికి వస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుకు ఘనస్వాగతం పలికేందుకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. మొదట హుజురాబాద్ కేసి క్యాంపు లోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకున్న హరీష్ రావుకు స్వాగతం పలికిన అనంతరం.. హుజురాబాద్ నుండి జమ్మికుంట వరకు అతిపెద్ద ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. హరీష్ రావు రాక సందర్భంగా గులాబీ పార్టీ తన బలాన్ని మరోసారి చాటి చెప్పేందుకు సన్నద్ధం అవుతుంది. హరీష్ రావు పర్యటన విజయవంతం చేసేందుకు గులాబి నేతలు సన్నద్ధం అవుతున్నారు.

**హరీష్ రావు పర్యటన విజయవంతం చేయండి**

**ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

హుజురాబాద్ నియోజకవర్గం లో ఈనెల 12న జరిగే మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే, శాసనసభ పక్ష ఉపనేత తన్నీరు హరీష్ రావు పర్యటనను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హుజురాబాద్లో పార్టీ శ్రేణులకు హరీష్ రావు దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. స్థానిక నియోజకవర్గంలో పార్టీ అత్యంత బలంగా ఉందని, రాబోయే కాలంలో మరింత బలోపేతం చేస్తామని అలాగే స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ కార్యక్రమంలో అర్హులైన వారి ఓట్లు పోకుండా చూస్తామని అన్నారు. అలాగే అర్హులైన వారి ఓట్లను ఓటర్ లిస్టులో నమోదు చేయిస్తామన్నారు. బూతుల వారిగా ఇందుకోసం ఇన్చార్జిలను నియమిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, గంద శ్రీనివాస్, క్రషర్ రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత షీ టీం లక్ష్యం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 8 :** మహిళల భద్రత షీ టీం లక్ష్యమని ఇన్చార్జి స్నేహలత అన్నారు.రామగుండం సి. పి ఆదేశాల మేరకు, పెద్దపెల్లి షీ టీమ్ వారు, పెద్దపెల్లి మండలం చీకురాయి గ్రామం లో గ్రామసభలో భాగంగా గ్రామస్తులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది అందులో భాగంగా షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు చైల్డ్ సేఫ్టీ గురించి తెలిపారు మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్సు గురించి ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం షీ టీమ్ సభ్యులు, సురేష్, మౌనిక, పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారిని సన్మానించిన రైతులు



**చురకలు ప్రతినిధి, మంథని, జూన్ 8 :** మంథని మండలం గుంజపడుగు గ్రామంలో అగ్రికల్చర్ ఆఫీసర్ గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లుతున్న శివకుమార్ ను గ్రామ రైతులు సోమవారం ఘనంగా సన్మానం సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిగా రైతులకు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. శివకుమార్ రైతుల అభివృద్ధి సంక్షేమం కోసం ఎన్నో సలహాలు సూచనలు ఇస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు చేరే విధంగా కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతులు ఊదరి లచ్చయ్య, రేగళ్ల రామన్న, విజయ్, రాజేందర్, రమేష్, రవీందర్, శేఖర్, తిరుపతి, ఓదెలు, బానయ్య, రాజు, మల్లేష్ తో పాటు రైతులు పాల్గొన్నారు.

## బిల్ కలెక్టర్ పై ఎంపీడీవోకు ఫిర్యాదు

**-ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట జూన్ 08 :** ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ గా పనిచేస్తున్న నరేష్ గతంలో ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ గా పనిచేస్తున్న సమయంలో ఇంటి పన్ను,, లైసెన్స్ ఫీజులు తన సొంతానికి వాడుకున్నాడని అధికారుల విచారణలో వెల్లడైన అతడిని విధులనుండి తొలగించకుండా తిరిగి ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ గా ఎలా విధుల్లోకి తీసుకున్నారని స్థానిక ఎంపీడీవో గుండోజు సత్తయ్యకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఫిర్యాదు చేసిన వారికి ఎంపీడీవో ఇది తన పరిధిలోకి రాదని జిల్లా కలెక్టర్ కు లేదా జిల్లా పంచాయతీ అధికారి కి ఫిర్యాదు చేయాలని సూచించినట్లు సమాచారం.

# కాళేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల అన్వేషణ

**-ఇద్దరు వ్యక్తుల అరెస్ట్**

**చురకలు ప్రతినిధి,జయశంకర్ భూపాలపల్లి, జూన్ 08 :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీసీఎస్ సిఐ రమేష్ ఆధ్వర్యంలోని సిసిఎస్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కాళేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం అన్వేషణ జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.విచారణలో భాగంగా గత ఆరు నెలలుగా కాళేశ్వరం పరిసర



ప్రాంతాల్లో గుప్తనిధుల కోసం అన్వేషిస్తున్నట్లు వారు వెల్లడించారు. వారి వద్ద నుంచి గుప్తనిధుల అన్వేషణకు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

**అరెస్టు అయిన వ్యక్తులు....**

ఇంజారపు వెంకటరమణ ప్రసాద్, టీచర్స్ కాలనీ, ఆదిలాబాద్, వలబోజు శ్రీనివాస్, సుధా నగర్, హనుమకొండ లను అరెస్టు చేసినవ్యక్తులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సీసీఎస్ సిఐ రమేష్ తెలిపారు.గుప్తనిధుల పేరుతో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# అధికారుల అండదండలతో అక్రమంగా మట్టి తవ్వకాలు

**-వెంకటాపూర్ నుండి పెద్దపల్లి తరలిపోతున్న మట్టి**
**-ఫిర్యాదులు చేసిన పట్టించుకోని రెవెన్యూ మైనింగ్ పోలీస్ అధికారులు,**
**-దొరికితే దొంగలు దొరకకపోతే దొరలే**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 08 :** ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని అపరెల్ పార్క్ వెనుక గల భాస్కర్‌రావు మారుపాక రాజుల పొలాల సమీపం లో అధికారుల అండదండలతో అక్రమంగా మట్టిని జెసిబిల ద్వారా తవ్వి టిప్పర్లతో మూడు జిల్లాలు దాటి పెద్ద పెల్లి జిల్లాకు ఇక్కడి నుండి గుట్టు చప్పుడుకాకుండా మట్టిని తరలిస్తున్నారు .వెంకటాపూర్ గ్రామానికి చెందిన గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.వారు దొరుకుతే దొంగలు దొరకకపోతే దొరలే అన్న చందంగా మట్టి మాఫియా వ్యవహరిస్తున్నారు.రాత్రి పూట పోలీసుల



పెట్రోలింగ్‌కు చిక్కకుండా పగలే అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని గుట్టు చప్పుడు కాకుండా విచ్చలవిడిగా తోడేస్తున్నారు.అపరెల్ పార్కు వెనుక వైపు నుండి వెంకటాపూర్ -రగుడు బైపాస్ గుండా పెద్దపల్లికి తరలిస్తూ వేలాది రూపాయలు దండుకుంటున్నారు.బిజెపి ఎల్లారెడ్డిపేట మండలశాఖ అధ్యక్షులు రేపాక రామచంద్రా రెడ్డి గ్రామస్తులు ఎల్లారెడ్డిపేట పోలీస్‌లకు తహసిల్దార్‌కు సమాచారం ఇవ్వగా మట్టిని తోడేస్తున్న మట్టి మాఫియాకు చెందిన జెసిబిని టిప్పర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.సంబంధిత మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా చూసి చూడనట్టుగా మళ్లీ యధావిధిగా మట్టిని నడిపిస్తున్నారు మైనింగ్ అధికారులు వాటాలు తీసుకొని మట్టి మాఫియాకు వత్తాసు పలుకు తున్నారు.సంబంధిత ఎల్లారెడ్డిపేట తాసిల్దార్ సుజాతను వివరణ అడగగా మేము వెంకటాపూర్ గ్రామంలో మట్టికి ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని మైనింగ్ అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు.మరి దీని వెనక మైనింగ్ అధికారులు పెద్దఎత్తున వాటాలు తీసుకొని మట్టి అక్రమార్కుల కు వత్తాసు పలుకుతున్నారు.వెంటనే మట్టి మాఫియా పైన మైనింగ్ అధికారుల పైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ మండలశాఖ అధ్యక్షులు రేపాక రామ చంద్ర రెడ్డి వెంకటాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు.మట్టి మాఫియా ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతు న్నాయి హరిదాస్ నగర్ గుట్టల నుండి ఫారెస్ట్ పార్కు నుండి ఓమౌ జయః ఆశ్రమం నుండి వెంకటాపూర్ పోతిరెడ్డిపల్లి అపరెల్ పార్క్ వెనుక గల ప్రభుత్వ భూములు అన్ని గుట్టలన్ని మట్టి మాఫియా తోడేశారు.జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ సమగ్ర విచారణ జరిపి మోకాపై పరిశీలన చేస్తే మట్టిని ఎంత తోడేశారో పూర్తి సమాచారం లభించే అవకాశాలు ఉన్నాయి.



# దివ్యాంగులకు ట్రై సైకిల్, వీల్ చైర్ అందజేత

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన దివ్యాంగులు**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూన్ 08 :** పలువురు దివ్యాంగుల ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పందించి.. సమస్యకు పరిష్కారం చూపారు.ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన చింతకింది లస్మయ్య, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన ముద్రకోల దీన దివ్యాంగులు సోమవారం ఐడీఓసీకి రాగా, వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వారు ఎక్కడి నుంచి వచ్చారు? ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తక్షణమే స్పందించి చింతకింది లస్మయ్య కు మాన్యువల్ ట్రై సైకిల్, ముద్రకోల దీనకు వీల్ చైర్ అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. వారికి వెంటనే మాన్యువల్ ట్రై సైకిల్, వీల్ చైర్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి అందజేశారు. తమ సమస్య, ఇబ్బందులను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో స్పందించి మాన్యువల్ ట్రై సైకిల్, వీల్ చైర్ అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ ఛైర్మన్‌గా ఎల్లంకి వంశీధర్



**చురకలు ప్రతినిధి,మంథని, జూన్ 8 :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గము 2026-2028 సంవత్సరాలకి గాను మంథని పట్టణానికి చెందిన 13వ వార్డు కౌన్సిలర్ ఎల్లంకి వంశీధర్ ను ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్-ఛైర్మన్ గా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం నియామక పత్రాన్ని ఎల్లంకి వంశీధర్ కు ఆయన అందజేశారు.ఈ రెండు సంవత్సరాల కాల పరిమితిలో మహాసభ అభివృద్ధికి, సంఘ అభ్యున్నతికి సంపూర్ణ సహాయ, సహకారాలు అందించి, ఆర్యవైశ్య జాతి ఆర్థిక, సామాజిక, రాజకీయ వైభవమునకు, మహాసభ సభ్యత్వమును పెంపొందించుటకు కృషి చేయాలని సూచించారు.తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణకు వంశీధర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు కొమురవెల్లి విజయకుమార్, నటరాజ్ లు పాల్గొన్నారు.

# ప్రజావాణి బాధితులకు జిల్లా కలెక్టర్ భరోసా



**చురకలు ప్రతినిధి కరీంనగర్, జూన్ 8 :** ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిత్రా ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు.ప్రత్యేకంగా వృద్ధులు, దివ్యాంగుల వద్దకే వెళ్లి వారి అర్జీలను స్వీకరించిన కలెక్టర్, సంబంధిత అధికారులను సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి, సమస్యలకు తగిన పరిష్కార మార్గాలు సూచించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో ఫైళ్లను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 144 దరఖాస్తులు అందాయి. జిల్లాలో 4, 6, 8, 10వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా గ్రామసభలు జరుగుతున్నాయి.ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సభల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావుతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఆటోలో వచ్చిన వృద్ధురాలు బొల్లం మల్లవ్వకు అండగా..**

గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు బొల్లం మల్లవ్వ తన కుమారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసేందుకు ప్రజావాణికి హాజరయ్యారు. ఆటోలో వచ్చిన ఆమె పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ స్వయంగా ఆమె వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు.తన కుమారులు తనను వేధిస్తున్నారని మల్లవ్వ విన్నవించగా, వెంటనే స్పందించిన కలెక్టర్ మహిళా సంక్షేమ శాఖ అధికారిణి సరస్వతిని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అధికారులు గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించి, కుమారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో మల్లవ్వ సమస్యకు పరిష్కారం లభించింది.

### బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

# ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

**-జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ.జానకి షర్మిల**



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూన్, 08 :** సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి,ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

## సి ఎం సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని "గడ్డం"



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 08 :** హైదరాబాద్ లో సి ఎం సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు నాయకులు గడ్డం నర్సయ్య పటేల్ నల్లమల వేంకటేశ్వర రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామ అభివృద్ధిలో పాలు పంచుకుందాం




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 08 :** గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరం పాలుపంచుకుందామని నాగారం సర్పంచ్ పోనగంటి కుమార్ అన్నారు.నాగారం గ్రామంలో గ్రామ సభ పొనగంటి కుమార్ సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నగరం గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేద్దామని పేర్కొన్నారు. ప్రజలు ఏదైనా సమస్య ఉన్నచో నేరుగా సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వోడ్నాల శ్రీనివాస్.పాలక వర్గ సభ్యులు పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ మరియ కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ రెవెన్యూ ఆర్ ఐ స్రవంతి అగ్రికల్చర్ కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి శాస్త్రవేత్త వెంకన్న,ఏఈఓ శ్వేత ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ నుండి సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ కృష్ణ గారు మరియు లైన్మెన్ శ్రీధర్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వర్క్ ఇన్స్పెక్టర్ సదానందం ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రణవ్ ఏఎన్ఎం శ్యామల గౌరీ ఆశా వర్కర్లు అంగన్వాడి టీచర్లు మహిళా సంఘాల వివోఏలు మాజీ సర్పంచ్‌లు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో

# ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూన్, 08 :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈరోజు ఎం.డి.నజీర్ ఖాన్,ఉప అటవీ క్షేత్రాధికారి అధ్యక్షతన సారంగాపూర్ మండలంలోని అడెల్లి నందనవనంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ సందర్భంగా నందనవన పరిసరాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు మరియు ఇతర చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఆదివారం అడెల్లి నందనవనానికి వేలాది మంది భక్తులు విచ్చేసి విందు, వినోద కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా స్టీల్ ప్లేట్ల వినియోగాన్ని ప్రోత్సహించే కార్యాచరణ చేపట్టాలని సమావేశంలో చర్చించారు. ఈ సందర్భం గా హాజరైన పలువురు దాతలు స్టీల్ ప్లేట్లను విరాళంగా అందించేందుకు ముందుకు వచ్చారు. త్వరలో అడెల్లి నందనవనంలో ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో స్టీల్ ప్లేట్ల వినియోగాన్ని అమలు చేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అడెల్లి సర్పంచ్ దండు సాయన్న,అజీజ్ ఖాన్,ఎంపీవో,శ్రీ శంకర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల,అడెల్లి గ్రామ వి.డి.సి. చైర్మన్, సభ్యులు,పంచాయతీ కార్యదర్శులు, వెన్నెల సుజాత ఎఫ్‌బిఓలు పాల్గొన్నారు. "ప్లాస్టిక్‌కు వీడ్కోలు –పర్యావరణానికి చేయూత" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



చురకలు ప్రతినిధి,నిర్మల్, జూన్, 08 : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## బ్రతుకుదెరువు కోసం మస్కట్‌కు శవపెటికతో ఇంటికి

**-మస్కట్లో నారాయణపూర్ కు చెందిన బత్తుల నరసింహులు గుండెపోటుతో మృతి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 08 :** బ్రతుకు దేరువు కోసం కన్నతల్లిని కట్టుకున్న భార్యను పిల్లలను వదిలి కానరాని దేశానికి వెళ్లి అక్కడ గుండెపోటుతో మరణించి శవపేటికతో ఇంటికి రానున్న బత్తుల నర్సింలు విషాదకర సంఘటన ఇది.ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బత్తుల నరసింహులు అనే నిరుపేద దళితుడు బ్రతుకు దెరువు కోసం కన్న తల్లిని భార్య పిల్లలను వదిలిపెట్టి కానరానీ దేశానికి గత 12 సంవత్సరాలుగా మస్కట్ దేశం వెళ్లాడు, అతనికి భార్య రేనా కుమారుడు రాకేష్ (28)లు ఉన్నారు.అతని కుమారుడు రాకేష్ కూడా బ్రతుకుదెరువు కోసం దుబాయ్ దేశం వెళ్ళాడు, ఆయన భౌతిక దేహం కోసం తని భార్య రేనా కుటుంబ సభ్యులు బంధుమిత్రులు గ్రామస్తులు ఎదురిచూస్తున్నారు కాగాఅతని కుమారుడు సైతం చివరిసారిగా తండ్రి నర్సింలు భౌతిక దేహాన్ని చూసుకోవడానికి దుబాయ్ దేశం నుంచి తిరిగి వస్తున్నారు.తన భౌతిక దేహాన్ని పంపించాలని స్థానిక సర్పంచ్ దోమ్మాటి నరసయ్య ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ద్వారా సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ద్వారా మస్కట్ లోని కంపెనీ యజమాన్యంతో మాట్లాడారు, వారం రోజులలోపు కంపెనీ తరపు వ్యక్తుల ద్వారా ఆయన స్వగ్రామమైన నారాయణపూర్ కు నర్సింలు భౌతిక దేహం ఉన్న శవ పేటిక ను పంపించనున్నట్లు కంపెనీ యజమాన్యం తెలిపినట్లు సర్పంచ్ దోమ్మాటి నరసయ్య తెలిపారు.

# కోటిలింగాల గోదావరిలో నిలిచిన బోటింగ్ సేవలు

**-వెంటనే పునరుద్ధరించాలంటున్న పర్యాటకులు**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూన్ 08 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గోదావరి వద్ద ఎల్లంపల్లి రిజర్వాయర్ లో పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన బోటింగ్ సేవలు గత 25 రోజులుగా నిలిచిపోవడంతో యాత్రికులు నిరాశకుగురౌతున్నారు. ప్రతినిత్యం శ్రీ కోటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం, గోదావరి పుణ్య స్నానాలకు వచ్చేయాత్రికులను దృష్టిలోపెట్టుకొని పర్యాటక శాఖ గోదావరి లో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసింది. దీనితో పర్యాటకుల రద్దీ పెరుగుతూ, ఆదాయం సమకూరుతున్నప్పటికి పర్యాటక శాఖ పాతబడిన బోట్లను పంపించి చేతులు దులుపుకోవడం మూలంగా తరుచుగా అట్టి బోట్లు రిపేర్ కు రావడం సాంకేతిక లోపాలకు గురికావడంతో బోటింగ్ విహారం నిలిచిపోగా పర్యాటకులు నిరుత్సాహానికి గురికావలసి వస్తుంది.బోటింగ్ నిర్వాహణలో కూడా లోపాలు లేకపోలేదు. పర్యాటక శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు న్నాయి.సరైన బోటింగ్ ఫ్లాట్ ఫామ్ లేక ఇబ్బందులున్నాయి.గతంలో ఓ బోట్ ఎల్లంపల్లి రిజర్వాయర్ వరదలో కొట్టుకుపోయిన విషయం విధితమే, ఇప్పటికైనా పర్యాటక శాఖ పట్టించుకొని కొత్తబోట్లను ఏర్పాటు చేసి,సరైన వసతులు కల్పించి నిర్వాహణలోపాలను పర్యవేక్షించి,వచ్చే గోదావరి పుష్కరాలను దృష్టి లోపెట్టుకొని వెంటనే బోటింగ్ సేవలను పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

# పన్నూర్ గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహణ



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 8 :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ రోజు రామగిరి మండలం పన్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ చిందం మహేష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మంథని సీఐ బోల్లపల్లి రాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామ సభలో క్రింది 7 అంశాలపై విస్తృతంగా చర్చించారు: వర్షాకాల సన్నద్ధతసురక్షిత త్రాగునీరుమన వ్యర్థాల నిర్వహణజల సంరక్షణవన మహోత్సవంఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్.)వరదల నిర్వహణ మరియు భద్రతసంబంధిత శాఖల అధికారులు పై అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మంథని సీఐ గొల్లపల్లి రాజు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్,నాలుగు చక్రాల వాహనదా రులు సీట్‌బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు.మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు వంటి ఘటనలపై వెంటనే ఫిర్యాదు చేయాలని, షీ టీమ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.మాదకద్రవ్యాల విని యోగం యువత భవిష్యత్తును దెబ్బ తీస్తుందని, డ్రగ్స్ విక్రయం, రవాణా, వినియోగం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని తెలిపారు.ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.అదేవిధంగా ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, నకిలీ వెబ్‌సైట్లు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు,పాస్‌వర్డు, ఓటీపీలు ఇతరుల తో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.సామాజిక మాధ్యమాల బాధ్యతాయుత వినియోగం, బాల్య వివాహాల నివారణ, మహిళలు మరియు బాలల రక్షణ, ప్రజా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో రామగిరి ఎస్ఐ తాడవేన శ్రీనివాస్ గారు,ఎంఆర్వో (తహసీల్దార్) సుమన్ , ఎంపీఓ సమ్మిరెడ్డి,ఎన్‌పీడీసీఎల్ ఏఈ మహేందర్ రెడ్డి,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధు,ఏఈఓ అరవిందర్, కేఎల్‌వీ డాక్టర్ నవ్య పాల్గొని తమ శాఖలకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రజల సమస్య లను తెలుసుకుని తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణకు ముందుకు రావాలి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 8 :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఎన్టీపీసీ కాకతీయ హాల్‌లో ఎన్టీపీసీ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, మైనర్ బాలికల రక్షణ,సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు,రోడ్డు భద్రత, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణా మాలు, వాటి నివారణ చర్యలు,అలాగే మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిలో మార్పు తీసుకురావడానికి పోలీసు శాఖను మరియు డీ-అడిక్షన్ కేంద్రాలను ఎలా సంప్రదించాలనే అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి,మున్సిపల్ కమిషనర్,డిప్యూటీ మేయర్,గోదావరిఖని ఏసీపీ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో తక్కువ సమయంలో భారీ వర్షాలు కురిసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు.శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, బలహీన నిర్మాణాలు భారీ వర్షాల సమయంలో ప్రమాదాలకు కారణ మయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు,కాలనీ నాయకులు తమ ప్రాంతాల్లో ప్రమాదకర భవనాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.పిల్లల్లో సెల్‌ఫోన్ విని యోగం పెరగడం,సామాజిక మాధ్య మాల ప్రభావం, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, సైబర్ నేరాలు ఆందోళనకరంగా మారుతు న్నాయని పేర్కొన్నారు.తల్లిదండ్రులు పిల్లల కార్యకలాపాలపై పర్యవేక్షణ పెంచడంతో పాటు వారి మొబైల్ ఫోన్ వినియోగాన్ని పరిశీలించాలని సూచించారు.డీసీపీ మాట్లాడుతూ మహిళల భద్రతే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.మైనర్ బాలికలు మోసపూరిత సంబంధాల బారినపడి ఇళ్ల నుంచి వెళ్లిపోతున్న ఘటనలు పెరుగుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలను అరికట్టేందుకు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు, మహిళలు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి వెంటనే పోలీసుల కు సమాచారం అందించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తేనే మహిళలపై జరిగే నేరాలను అరికట్టడం సాధ్యమ వుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి,అఫ్జలుద్దీన్,ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్,లచ్చన్న,రామ గుండం ఎస్ఐ సంధ్యారాణి,ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ

# భాగస్వాములు కావాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 8 :** గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచ్ గుడి యాదవ్ అన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ రోజు గ్రామ పంచాయతీ కన్నాల మంథని మండలంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించి ప్రజలందరికీ వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజా సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం జరిగింది.ఈ గ్రామసభకు సర్పంచ్ గుడిస గట్టయ్య యాదవ్ సర్పంచ్ అధ్యక్షత వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదె దివ్య మరియు వార్డ్ సభ్యులు కన్నాల స్కూలు హెచ్ఎం మరియు ఉపాధ్యాయులు ఏఎన్ఎం గారు,ఆశా కార్యకర్తలు,ఫీల్డ్ అసిస్టెంట్ మరియు జేఎల్ఎం,స్వయం సహాయక సంఘాల సభ్యులు,గ్రామ పంచాయతీ సిబ్బంది,యువకులు, రైతులు,మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.గ్రామ సభలో ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, ఎస్ఐఆర్‌ఓటరు జాబితా ప్రత్యేక సవరణ,ఎల్‌నినో సంసిద్ధత, వర్షాకాల ముందస్తు చర్యలు, సీజనల్ వ్యాధుల నివారణ, సాగునీటి నిర్వహణ, విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా ఎన్ ఎఫ్ బి ఎస్ పథకం తదితర అంశాలపై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.

## వంటింట్లో జారిపడి మహిళ మృతి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 08 :** ఓ గృహిణి వంటింట్లో పనిచేస్తుండగా జారిపడి తలకు బలమైన గాయమై చికిత్స పొందుతుండగా సోమవారం మృతి చెందింది.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మల్లుపల్లి రమేష్ గౌడ్ భార్య లావణ్య (48)శుక్ర వారం వంటింట్లో పని చేస్తుండగా కాలుజారి కింద పడింది.వెంటనే స్థానిక హాస్పిటల్కు తరలించారు.. తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పించి సర్జరీ చేయించారు. చికిత్స అందిస్తుండగా కొద్దిసేపటి క్రితం మృతి చెందినట్లు సమాచారం. మృతురాలికి భర్త రమేష్ గౌడ్ కుమారులు వెంకటేష్ గౌడ్ దినేష్ ఒక కూతురు ఉన్నారు.

## హుజురాబాద్

## ఆర్డీఓగా జాల కుమారి

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 8 :** హుజురాబాద్ కొత్త రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్ డి వో) గా జాల కుమారి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఆర్డీవో రమేష్ బాబును ఆందోల్ ఆర్డిఓ గా ప్రభుత్వం బదిలీ చేసింది. సోమవారం పలువురు ఆర్డిఓ లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జాల కుమారి నిర్మల్ లో రెవిన్యూ భూ సేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పని చేశారు.